

జొన్న కొనుగోళ్లు.. ఇంకెప్పుడు?



- జిల్లాలో చేతికొచ్చిన పంట దిగుబడులు
- ఇంకా ప్రారంభం కాని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు
- అత్యవసరాల పేరిట అమ్మేసుకుంటున్న రైతులు
- అధికారులకు ముందు చూపు కరువు
- ఆందోళనలో జిల్లా రైతులు

ఆదిలాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి)

యాసంగి సీజన్‌లో సాగుచేసిన జొన్న పంట కొనుగోళ్లపై ఇంకా సందిగ్ధ పరిస్థితులే కనిపిస్తున్నాయి. జిల్లాలో నీటి వసతి అంతంత మాత్రంగానే ఉండడంతో ఆరుతడి పంటలనే రైతులు ఎక్కువగా సాగు చేశారు. ఇందులో ప్రధానంగా మొక్కజొన్న, జొన్న, శనగ తదితర పంటలు సాగయ్యాయి. ఇప్పటికే మొక్కజొన్న, శనగ పంటల కోతలు పూర్తికావడంతో జొన్న పంట గత పక్షం రోజుల క్రితమే చేతికి వచ్చింది. అయినా అధికారులు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులకు ఎదురు చూపులు తప్పడం లేదు. జిల్లా వ్యాప్తంగా 69వేల ఎకరాలలో జొన్న పంట సాగయ్యింది. ఈ సారి వాతావరణ పరిస్థితులు అనుకూలించడం, సరిపడా నీటి తడులు అందడంతో సారవంతమైన నల్లరేగడి నేలల్లో దిగుబడులు ఆశాజనకంగానే కనిపిస్తున్నాయి. దీంతో ఎకరాన 10 నుంచి 12 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన సుమారుగా 10లక్షల క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. కానీ ప్రతీసారి కొనుగోళ్ల ప్రక్రియ ఆలస్యం కావడంతో సగం పంట దళారుల పాలవుతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈసారి కూడా అవే పరిస్థితులు కనిపిస్తున్నాయి. సగం పంట అమ్మిన తర్వాత కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినా.. అంతగా ప్రయోజనం ఉండదంటున్నారు. ఇప్పటికే కొంత మంది రైతులు పంటను నూర్పిడి చేసిన కురుస్తున్న అకాల వర్షాలతో పంట కోతకు ఆలస్యమవుతుంది. ఏప్రిల్ 10 నుంచి జొన్న పంటను కొనుగోలు చేస్తామని మొదట అధికారులు ప్రకటించిన వర్షాల కారణంగా ఏప్రిల్ 15 నుంచి కొనుగోలు చేసే అవకాశం కనిపిస్తుంది. అయితే అన్నదాతల అవసరాన్ని ఆసరాగా చేసుకుంటున్న దళారులు రైతులకు నగదును ఆశచూపుతు అందినకాడికి దండుకోవడంతో.. జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

● మరింత ఆలస్యమయ్యే అవకాశం

జిల్లాలో అకాల వర్షాలు కురుస్తున్న కారణంగా జొన్నపంట కొనుగోళ్లు మరింత ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. ప్రతియేటా జొన్న కొనుగోళ్లలో అధికారుల నిర్లక్ష్యమే కనిపిస్తుంది. అసలు సాగు విస్తీర్ణం దిగుబడి అంచనా అధికారులకు ముందే తెలిసినా.. ముందుచూపు లేకుండా పోతుంది. పంట వేసిన తర్వాత నాలుగైదు నెలల పాటు సమయం ఉంటుంది. కానీ ప్రతీసారి పంట కొనుగోళ్లలో జాప్యం జరుగుతూనే ఉంది. ముందు చూపుతో పంట చేతికొచ్చే సమయానికే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే రైతులు నష్టపోయే అవకాశం ఉండదంటున్నారు. వచ్చిన దిగుబడులు వచ్చినట్లుగానే అమ్ముకునే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం మద్దతు ధరను ప్రకటించినా.. ఎలాంటి ప్రయోజనం ఉండదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇకనైనా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే రైతులు జొన్నపంటను అమ్ముకునే అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు. అధికారులు ముందుచూపుతో వ్యవహరిస్తే రైతులకు ఎంతో మేలు జరిగే అవకాశం ఉందంటున్నారు.

● క్వింటాలు మద్దతు ధర రూ.3180

ఈ యేడు క్వింటాకు మద్దతు ధర రూ.3180గా ప్రభుత్వం నిర్ణయించింది. కానీ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులు క్వింటాలు రూ.1500ల నుంచి రూ.2వేల వరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో క్వింటాలుపై రైతులు వెయ్యి రూపాయలకు పైగా నష్టపోతున్నారు. పంట చేతికొచ్చిన ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో మద్దతు ధర కొందరికే దక్కే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే పంట నూర్పిడి చేసిన రైతులు బయట మార్కెట్‌లో దళారులను ఆశ్రయించి పంటను అమ్మేసుకుంటున్నారు. తీవ్రమైన ఎండలు, ఈదురు గాలులు, అకాల వర్షాలతో ఆరబెట్టి నిల్వ చేసుకునే అవకాశం లేకపోవడంతో ఆదరాబాదరగా అమ్మేసుకుంటున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దళారులే నేరుగా ఇంటికి వచ్చి రైతులను మభ్యపెడుతూ తక్కువ ధరకే పంటను కొనుగోలు చేస్తూ లాభాలను దండుకుంటున్నారు. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నా.. సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకున్నట్టు కనిపించడం లేదు. త్వరగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే తేమశాతం ఎక్కువగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అసలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం 14 తేమశాతం ఉన్న జొన్నలకు మాత్రమే మార్క్‌ఫెడ్ అధికారులు కొనుగోలు చేస్తారు. ఆపై తేమ శాతం ఉంటే కొనుగోలుకు నిరాకరిస్తారు. ఈ యేడు ఎకరాన 8క్వింటాళ్ల 50కిలోలను మాత్రమే కొనుగోలు చేయాలని మార్క్‌ఫెడ్ అధికారులు పరిమితులు విధించారు. ఎకరాన 12క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయని రైతులు పేర్కొంటున్నారు. గతంలో రైతులు ఆందోళనలు, నిరసనలు చేపడితేనే ప్రభుత్వం జొన్న కొనుగోళ్లను ప్రారంభించిన దాఖలాలు ఉన్నాయి.

● భయపెడుతున్న అకాల వర్షాలు

ప్రభుత్వ కొనుగోళ్లు ఆలస్యమైతే రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం కనిపిస్తోంది. అకాల వర్షాలకు పంట దిగుబడులు తడిసి పోవడంతో నాణ్యత లేక మద్దతు ధరలో కోతలు విధించే అవకాశం ఉంటుంది. ఈసారి అలాంటి పరిస్థితులే కనిపిస్తున్నాయి. గత నాలుగైదు రోజులుగా జిల్లాలో అకాల వర్షాలు కురవడంతో అన్నదాతలు భయాందోళనకు గురవుతున్నారు. ఈదురు గాలులతో చేతికొచ్చిన పంట నేలకొరగడంతో కోతలకు ఇబ్బందులు ఏర్పడడంతో పాటు పంట నాణ్యత దెబ్బతింటుందని భయపడుతున్నారు. చేతికొచ్చిన పంటను చేనులోనే కుప్పలు పోసి అకాల వర్షాల నుంచి కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. వాతావరణం సహకరించకుంటే దిగుబడులు చేతికొచ్చిన కష్టంగానే ఉంటుందని వాపోతున్నారు. నిత్యం ఈదురుగాలుల భీభత్సం, అకాల వర్షాలకు పంట దిగుబడులు తడిసి పోయే ప్రమాదం కనిపిస్తుంది. రోజుల తరబడి పంటను కుప్పలు పోయడంతో నాణ్యత కోల్పోతుందని చెబుతున్నారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంటను అమ్ముకునే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు.

త్వరలోనే కొనుగోళ్లను ప్రారంభిస్తాం

- శ్రీనివాస్ (జిల్లా మార్కెటింగ్ అధికారి, ఆదిలాబాద్)

జిల్లాలో ఇప్పుడిప్పుడే జొన్న పంట కొనుగోళ్లు చేతికి వస్తున్నాయి. త్వరలోనే మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోళ్లను ప్రారంభిస్తాం. రైతులు నాణ్యమైన పంట దిగుబడులను తీసుకొచ్చి మద్దతు ధరను పొందాలి. 14తేమ శాతం ఉండే విధంగా పంటను ఆరబెట్టాలి. ఇదివరకే జొన్న కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. ఈ నెల 15 నుంచి పంట కొనుగోళ్లను ప్రారంభించే అవకాశం ఉంది. రైతులు ఆదరబాదరగా దళారులకు అమ్ముకుని నష్టపోవద్దు.



జిల్లాకేంద్రంలో ప్రార్థనలకు హాజరైన ముస్లింలు





ప్రార్థనలు చేస్తూ..



• శుభాకాంక్షలు తెలిపిన పలు పార్టీల నేతలు • సందడిగా మారిన ఈద్గాలు

ఘనంగా రంజాన్

జిల్లాఅంతటా రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించారు. బుధవారం రాత్రి నెలవంక దర్శనమివ్వడంతో మసీదుల్లో ఇమామ్‌లు ఈద్‌ను ప్రకటించారు. ఇక గురువారం ఉదయం నుంచే జిల్లా వ్యాప్తంగా రంజాన్ సందడి నెలకొంది. నెల రోజుల పాటు కఠిన ఉపవాసదీక్షలు నిర్వహించిన అనంతరం ముస్లింలు పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జిల్లాకేంద్రంలోని ఈద్గా మైదానం వద్ద నిర్వహించే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రత్యేకప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులకు ఎస్పీ గౌస్‌ఆలం, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్ చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ ఛైర్మన్ అడ్డిభోజారెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనీషా పవన్‌రావ్‌లు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

● ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్



ఇచ్చోడలో ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు




మతపెద్ద సందేశం




ఖీర్ తాగుతున్న ఎమ్మెల్యే బొజ్జు



శుభాకాంక్షలు తెలుపుతున్న జోగు రామన్న, ఆత్రం సక్కు



శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్పీ గౌస్‌ఆలం



శుభాకాంక్షలు తెలుపుతున్న కంది శ్రీనివాస్‌రెడ్డి



గుడిహత్నూర్‌లో శుభాకాంక్షలు తెలుపుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



పిప్పల్‌కోటిలో మజీద్‌లో ప్రవచనాలు చెబుతున్న హాఫీజ్ అహ్మద్ రజవి



శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లింలు



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్

తేనెటీగల దాడిలో గాయపడిన
ఉపాధి కూలీలకు ఎమ్మెల్యే పరామర్శ

ఆదిలాబాద్, ఏప్రిల్11 (ఆంధ్రజ్యోతి): తేనెటీగల దాడిలో గాయపడిన బేల మండలం రేణుగూడ గ్రామ ఉపాధి కూలీలకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే పాయలశంకర్ వైద్య సిబ్బందికి సూచించారు. తేనేటీగల దాడిలో గాయపడిన వారిని గురువారం రిమ్స్ ఆసుపత్రిలో బీజేపీ నాయకులతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితులతో మాట్లాడి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు.బాధితులను ప్రభుత్వ పరంగా సహాయం అందించి అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఉపాధి కూలీలకు మెరుగైన వైద్యం అందించాలి

ఆదిలాబాద్‌అర్బన్: తేనెటీగల దాడిలో గాయపడిన రేణుగూడ ఉపాధి కూలీలకు మెరుగైన వైద్యం అందించాలని టీఏజీఎస్ రాష్ట్రప్రధాన కార్యదర్శి పూసంసచిన్ డిమాండ్‌చేశారు. గురువారం తేనెటీగల దాడిలో గాయపడిన వారిని వ్యవసాయ కార్మిక సంఘం నేత ఆశన్నతో కలిసి రిమ్స్‌లో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పనిప్రదేశాల్లో కూలీలకు రక్షణ కల్పించడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. బాధిత కుటుంబాలకు నష్టపరిహారం అందించాలన్నారు.



జ్యోతి బాపూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

మహాత్మా జ్యోతిబా పూలేకు ఘన నివాళి

మావల, ఏప్రిల్11: బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి మహాత్మాజ్యోతి బాపూలే జయంతి సందర్భంగా గురువారం తెలంగాణ రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా స్థానిక దస్నాపూర్‌లో బీసీ స్టడీ సర్కిల్ ఆవరణలో ఉన్న పూలే విగ్రహానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. కార్యక్రమంలో మావల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, దామోదర్‌రెడ్డి, నాగరాజు, రంజిత్, వెంకటేష్ ఉన్నారు.

బోథ్: అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసం జ్యోతిబా పూలే ఎంతగానో కృషి చేశారని బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆత్మ ఛైర్మన్ మల్లెపూల సుభాష్ పేర్కొన్నారు. గురువారం మండలకేంద్రంలోని జ్యోతిబా పూలే జయంతి వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ రమణగౌడ్, బీఆర్ఎస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ ప్రవీణ్ మేటి, బీసీ సెల్ మండలం అధ్యక్షులు రమణ, డైరెక్టర్ నారాయణ, నాయకులు పాల్గొన్నారు.



బోథ్‌లో జయంతి వేడుకల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు



రంజాన్ పండుగ వేళ..

ఆదిలాబాద్‌లో కత్తి పోట్ల కలకలం

- ఒకే వర్గానికి చెందిన వ్యక్తుల మధ్య ఘర్షణ
- వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పక్కనే ఘటన

ఆదిలాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రంజాన్ పండుగ వేళ కత్తిపోట్ల కలకలం రేపింది. గురువారం చిరు వ్యాపారం చేస్తున్న కొందరు యువకుల మధ్య డబ్బుల విషయంలో తలెత్తిన గొడవ ఘర్షణకు దారి తీసింది. వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పక్కనే ఓల్డ్ బస్టాండ్ సమీపంలో ఘర్షణ చోటు చేసుకుంది. జిల్లా కేంద్రానికి చెందిన ముజాహిద్, షాహిద్‌లు గాయపడ్డారు. ఈ ఘర్షణలో యువకుల మధ్య కత్తిపోట్లకు దారి తీసింది. ఈ దాడుల్లో ముగ్గురు కోలిపుర కాలనికి చెందిన యువకులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని స్థానికులు వెంటనే రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కాగా.. దాడి చేసిన యువకులు ఇద్దరు పరారైనట్లు సమాచారం. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ సత్యనారాయణ తెలిపారు. అయితే ఐపీఎల్ బెట్టింగ్ విషయంలోనే యువకుల మధ్య డబ్బుల వ్యవహారం ఈ ఘర్షణకు దారి తీసిందన్న ప్రచారం జరుగుతోంది.





కత్తిపోట్ల దాడిలో గాయపడ్డ యువకులు

'సామాజిక సేవలో ముందుండాలి'

బోథ్, ఏప్రిల్ 11 : సామాజిక సేవా కార్యక్రమాలలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ముందుండాలని ఆ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేంద్ర పేర్కొన్నారు. గురువారం మహాత్మా జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా పూలే సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాల్లో ముందుంటే ప్రజలు గుర్తింపు ఇస్తారన్నారు. భారతదేశంలో విద్యాభివృద్ధికి పూలే ఎంతగానో కృషి చేశారన్నారు. అట్టడుగు వర్గాల ప్రజల కోసం పాఠశాలలు ప్రారంభించి ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో బోథ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రఫూల్ చందర్‌రెడ్డి, పూలే వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు గాజుల పోతన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్, సాయి కృష్ణ, అమృతరావు, పోతన్న, కొల్హారి అనిల్, సొసైటీ సభ్యులు శ్రీధర్, రాజేష్, జ్ఞానేశ్వర్, నాయకులు పోతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కనుగుట్ట ఆశ్రమానికి భక్తుల పాదయాత్ర

తాడ్వాయికి పాదయాత్రగా బయలుదేరిన భక్తులు

బోథ్, ఏప్రిల్ 11 : మండలంలోని కౌటా(బి), కనుగుట్ట ఆశ్రమానికి భక్తులు పాదయాత్రగా బయలుదేరారు. ఈ సందర్భంగా భక్తులు రామనామ సంకీర్తన చేస్తూ పాదయాత్రలో పాల్గొన్నారు. శ్రీరామనవమి రోజున తాడ్వాయిలోని శబరిమాత ఆశ్రమానికి చేరుకోవడం జరుగుతుందని భక్తులు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా నుంచి దాదాపు 300 మంది వరకు భక్తులు పాదయాత్రగా బయలుదేరుతారని వారు తెలిపారు.

లక్ష్మీపూర్ చెక్‌పోస్టు వద్ద రూ.90వేల నగదు పట్టివేత



కారులో తరలిస్తున్న నగదును పట్టుకున్న ఎన్నికల అధికారులు

తలమడుగు, ఏప్రిల్ 11 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని లక్ష్మీపూర్ చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేయుచుండగా కిన్వట్ నుంచి ఆదిలాబాద్‌కు మారుతిషిఫ్ట్‌కార్ నెంబర్ ఎంహెచ్29ఏడీ1074లో ప్రయాణిస్తున్న గంగాధర్ సీతారాం బట్టలవార్ కాంట్రాక్టర్ గ్రామం రాజుగాడ్ తాలుకా కిన్వట్ జిల్లా నాందేడ్ మహారాష్ట్ర నుంచి రూ.90వేల ఎలాంటి ఆధారం లేకుండా తీసుకెళ్తుండగా లభ్యమైనవి. వాటిని ఎఫ్ఎస్‌టీకు అప్పగించడం జరిగినది. తలమడుగు ఎస్సై ధనశ్రీ తెలిపారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఉన్నందున రూ.50వేలకు పైగా ఎవరైనా వెంట తీసుకెళ్తే వాటికి సంబంధించిన రషీదులు వెంట ఉంచుకోవాలన్నారు. అంతేకాకుండా చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ప్రతి వాహనాన్ని క్షుణంగా పరిశీలించాలని కోరారు. ఇందులో ఏఎస్సై సురేందర్, చెక్‌పోస్టు వద్ద ఎన్నికల నిధులు నిర్వహిస్తున్న అధికారులు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్‌పండుగ వేళ... కూలీ గడప తట్టిన ఎమ్మెల్యే

ఉట్నూర్,ఏప్రిల్11:ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ రంజాన్ పండుగ రోజు ఆకస్మీకంగా పేదోళ్ల వాడలో అడుగు పెట్టారు. ఈ ఘటన గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. నెల రోజుల ఉపవాసాల తర్వాత గురువారం ముస్లింలు ఈదుల్ ఫితర్ పండుగను జరుపుకున్నారు. అయితే ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ మోమిన్‌పురలో కడు పేదరికంలో ఉన్న ముస్లిం వాడకు వెళ్లారు. అక్కడున్న అల్లా బకస్ అనే కూలి ఇంటికి వెళ్లారు. అకస్మీకంగా ఎలాంటి సమాచారం లేకుండా తమ వాకిట్లో అడుగు పెట్టిన ఎమ్మెల్యేను చూసి పేద కుటుంబం పులకరించి పోయింది. ఇంటిల్లిపాదితో కలిసి ఎమ్మెల్యే భోజనం చేశారు.పాయసం తిన్నారు.వారి సమస్యలు విన్నారు.రెండు గదులున్న ఇంట్లో ఐదు కుటుంబాలు నివసిస్తున్నాయని అల్లాబకాస్ ఎమ్మెల్యేకు వివరించారు.తనకు పెన్షన్ రావడం లేదన్నారు.తాను ఉన్నానని ఎమ్మెల్యే ఆ కుటుంబానికి భరోసా ఇచ్చారు.ఇంటి భూమితో పాటు ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్ మంజూరు చేస్తానని భరోసా ఇచ్చారు.పేదోడి ఇంటికి ఎమ్మెల్యే వచ్చారని తెలిసి వాడ వాడంతా కదిలి వచ్చింది. వారి మొహాల్లో కొత్త ఆనందం వెల్లివిరిసింది. చిన్నాపెద్ద అందరూ కలిసి ఎమ్మెల్యేతో కలిసి ఫోటోలు దిగారు.

కౌటా(బి)లో మంచినీటి ఎద్దడి

బోథ్, ఏప్రిల్ 11 : మండలంలోని కౌటా(బి) గ్రామంలో మంచినీటి ఎద్దడి నెలకొంది. గత వారం రోజులుగా కొత్త కాలనీలో మోటార్ చెడిపోయి మరమ్మతులకు నోచుకోలేదు. ఫలితంగా ఆ కాలనీలో నీటి ఎద్దడి నెలకొంది. అంతేగాక గత నెల రోజులుగా గ్రామ పంచాయితీలో పని చేస్తున్న సిబ్బందికి వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయంలో ప్రత్యేక అధికారి పట్టించుకుని సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

ఉట్నూర్‌లో ఘనంగా జ్యోతిబా పూలే జయంతి

ఉట్నూర్,ఏప్రిల్11:మహాత్మాజ్యోతిబాపూలే జయంతి కార్యక్రమాన్ని ఉట్నూర్‌లో గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఐక్యమాల సంక్షేమ సంఘ వేదిక ఆధ్వర్యంలో ఉట్నూర్ పట్టణ అధ్యక్షులు అల్లునూరి రమేష్‌సుభాష్, బొంకంటి అధ్యక్షతన అంటరాని తనం కులవ్యవస్థ నిర్మాణంతో పాటు మహిళోద్ధరణకు కృషి చేసిన మహనీయుడు అని అన్నారు.అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పని చేసిన సంఘ సంస్కర్త మహాత్మాజ్యోతిరావ్‌పూలే 198 జయంతి వేడుకలను బాబా సాహెబ్ వీధిలో జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో మాల కులస్థులు అర్జున్న, పురుషోత్తం, స్వామిదాస్, గణేష్, ఆనంద్ బాబు, వెంకటేష్, ప్రశాంత్, లింగవ్వా, భూమక్క, పుష్పలత, వీడి పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు మెరుగైన వైద్యం అందించాలి


ఆదిలాబాద్‌అర్బన్, ఏప్రిల్ 11 : తేనేటీగల దాడిలో గాయపడిన రేణుగూడ గ్రామ ఉపాధి కూలీలకు మెరుగైన వైద్యం అందించాలని టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసంసచిన్ డిమాండ్‌చేశారు. గురువారం తెనేటీగల దాడిలో గాయపడిన వారిని వ్యవసాయ కార్మిక సంఘం నేత ఆశన్నతో కలిసి రిమ్స్‌లో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పని ప్రదేశాల్లో కూలీలకు రక్షణ కల్పించడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. బాధిత కుటుంబాలకు నష్ట పరిహారం అందించి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు.


బాసర లడ్డూల్లో సిబ్బంది స్వాహా పర్వం

- అధిక ధరలు.. 'లెక్క'కు లేని సరుకులే కాదు .. బాసర ప్రసాద విభాగంలో అక్రమాలెన్నో
- అనధికారికంగా ప్రసాదాల విక్రయం
- అమ్మిన టికెట్లనే మళ్లీ రీసైక్లింగ్!
- మరికొందరి పాత్రపైనా అనుమానాలు
- అక్రమార్కులను రక్షించేందుకు మాజీ మంత్రి ప్రయత్నాలు



భక్తులకు లడ్డు ప్రసాదం విక్రయించే కౌంటర్


లడ్డూ ప్రసాదం తయారీ పోటు


బాసరలోని సరస్వతీ అమ్మవారి ఆలయం

బాసర, ఏప్రిల్, 11 : బాసర సర్వతీ దేవస్థానం ప్రసాదాల తయారీ, ప్రధాననిల్వ కేంద్రంలో అక్రమాలు ఒక్కొక్కటి బయట పడుతున్నాయి. తీగలాగితే డొంకంతా కదిలింది అన్నట్లు అధికధరలకు సరుకులు కొనుగోలు ఒకటే కాదు సరుకుల విషయంలో మాయచేసి పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. అంతేగాక ప్రసాదాల విక్రయాల్లో చేతివాటం ప్రదర్శించి అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రికార్డుల ప్రకారం అన్నీ జాగ్రత్తలు తీసుకొని ప్రతీయేటా రూ. కోట్ల అమ్మవారి నిధులు కొందరు పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కింది స్థాయికి సంబంధం లేకుండా కీలకస్థానాల్లో ఉన్న కొంత మంది ఉద్యోగులు కలిసి సహకార్యం .. సహాపర్వానికి తెర లేపినట్లు విచారణలో వెల్లడైంది.

టికెట్లు తరగవు.. లడ్డూలు కనిపించవు

ప్రసాద విక్రయాల్లో భారీ స్థాయిలో గోల్‌మాల్ జరుగుతున్నట్లు తెలిసింది. భక్తులు మొదట టికెట్ కొనుగోలు చేసి పక్కనే మరో కౌంటర్‌లో టికెట్‌లు ఇచ్చి లడ్డూ ప్రసాదాలను పొందుతున్నారు. ఇలా భక్తులు ఇచ్చిన టికెట్లను వెంటనే చింపివేయాలి. కాని సిబ్బంది వాటిని అలానే ఉంచి తిరిగి విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి ఆరోపణలే అభిషేకం లడ్డూ విక్రయాల్లో కూడా చోటుచేసుకుంటున్నట్లు తెలుస్తోంది. భక్తుల రద్దీ అధికంగా ఉన్న రోజుల్లో వీరి అక్రమాలను పెంచేస్తున్నట్లు వినికిడి.

సరుకులు పక్కదారి

అధిక ధరలకు నిత్యావసర సరుకులు కొనుగోలు చేయడంపై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితంకాగానే విచారణకు వచ్చిన దేవాదాయ శాఖ విజిలెన్స్ తనిఖీల్లో కొత్త అక్రమాలు వెలుగుచూశాయి. దేవస్థాన రికార్డుల ప్రకారం ఉండాల్సిన నిత్యావసర సరుకులు తక్కువగా ఉన్నాయి. విచారణ అధికారి చేపట్టిన కొద్ది నిమిషాల వ్యవధిలోనే లడ్డూ తయారీకి వినియోగించే నెయ్యి, శనగపప్పు ఉండాల్సిన నిల్వల కంటే తక్కువగా ఉన్నాయి. స్టోర్‌రూమ్‌లో ఉన్న మిగితా సరుకులన్నీంటిని పరిశీలిస్తే ఆలయ అధికారుల భారీ అవినీతి బాగోతం బయటపడేది. అధికారులు తరుచుగా తనిఖీ చసి రికార్డులను, సరుకులను సక్రమంగా ఉంచాల్సిన అవసరం ఉంది. కాని అలాంటి చర్యలు చేపట్టకపోవడంతో రూ. లక్షల అమ్మవారి నిధులు పక్కదారి పట్టాయి. సరుకులను తక్కువగా కొనుగోలు చేసి ఎక్కువగా నమోదు చేయడం లేదంటే వచ్చిన సరుకులను పక్కదారి పట్టించడం వల్లనే ఈ లెక్కల్లో తేడా ఏర్పడినట్లు అర్థమవుతుంది. మూడు నెలలకొకసారి ఈ విభాగాల్లో సిబ్బందిని మార్చుతూ ఉంటారు. ఈ సమయంలో ఈ తేడాలు ఆలయ అధికారులకు గుర్తించే అవకాశం ఉంటుంది. కాని అందరికీ తెలిసే ఈ అవినీతి అక్రమాలు చోటుచేసుకుంటున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అక్రమాల్లో ఈ ఒక్కరే బాధ్యులు కాదు మరికొంతమంది నిర్లక్ష్యం, పాత్ర ఉన్నట్లు తెలుస్తోంది.

కమిషనర్ ఆదేశాలు బేఖాతరు

దేవస్థానంలో స్టోర్, ప్రసాదాల తయారీ విభాగం అత్యంత కీలకమైనది. ఉన్న సిబ్బందిలో నిర్లక్ష్యం లేకుండావ్యవహరించే వారిని ఈ విభాగ బాధ్యతలను అప్పజెప్పాలి. కాని నిబంధనలకు విరుద్ధంగా కమిషనర్ ఆదేశాలను ఖాతరు చేయకుండా ఓ అధికారిని ఈ విభాగ బాధ్యతలను అప్పగించారు. సదరు అధికారి గతంలో సస్పెన్షన్‌కు గురై తిరిగి విధుల్లోకి చేరినప్పుడు ప్రాధాన్యత లేని పోస్టుల్లో కొనసాగించాలని స్పష్టంగా సూచించారు. దీన్ని పట్టించుకోకుండానే ఆలయ అధికారులు సదరు ఉద్యోగికి సెంట్రల్ స్టోర్, ప్రసాదాల తయారీ విభాగంలో విధులను కేటాయించారు. సదరు ఉద్యోగి నిరాకరించినప్పటికి బలవంతంగా బాధ్యతలు అప్పగించినట్లు సదరు ఉద్యోగికి సంబంధించిన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అక్రమార్కుల రక్షణకు మాజీ మంత్రి ప్రయత్నాలు

దేవాదాయ శాఖలో అవినీతిపట్ల ఆ శాఖ కమిషనర్ హన్మంత్‌రావు కఠినమైన చర్యలు తీసుకుంటున్నారు. బాసర నిత్యావసర సరుకుల కొనుగోలు అక్రమాలు విషయంలో కూడా సీరియస్‌గా ఉన్నారు. వెంటనే విజిలెన్స్ విచారణ చేయించారు. దీంతో బాసర ఆలయ అధికారులు క్రమశిక్షణ చర్యల నుంచి తప్పించుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో దేవాదాయ శాఖకు సంబంధం ఉన్నమంత్రిగా పనిచేసిన నాయకుని వద్దకు వెళ్లి మొరపెట్టుకున్నట్లు తెలిసింది. సదరు నాయకునిచే దేవాదాయ శాఖ ఉన్నతాధికారులపై ఒత్తిడి తెప్పించినట్లు సమాచారం. ఇది విషయం ఇప్పుడు ఆలయ వర్గాల్లో ముమ్మర ప్రచారం కొనసాగుతోంది. ఎలాంటి చర్యలు లేవనే ధీమాలో అక్రమాలకు పాల్పడిన బాధ్యులు ఉన్నారు. గత ప్రభుత్వ నాయకులు, ప్రస్తుత ఐఏఎస్ అధికారులను సైతం వదలడం లేదు. దైవదర్శనానికి వచ్చినవారిని తమను కాపాడడంటూ ఆలయ సిబ్బంది మొరపెట్టుకుంటున్నారు.

బాధ్యులందరిపై చర్యలు తీసుకోవాల్సిందే..

అమ్మవారికి భక్తులు ఎంతో భక్తితో సమర్పించిన సొమ్మును కాపాడాల్సిన అధికారులు అక్రమాలకు పాల్పడడం బాధాకరం, ప్రతిరోజు అందరూ వినియోగించే సరుకులను అధిక ధరలకు కొనుగోలు చేయడం అధికారుల అవినీతిని తెలియజేస్తుంది. అధికారులు సరుకులను బయట మార్కెట్‌లో విక్రయించడం వల్లనే లెక్కకు తక్కువగా వస్తున్నాయి. ఈ అవినీతిలో బాధ్యులైన ప్రతి ఒక్కరిపై చర్యలు తీసుకోవాలి.

(సంజీవ్ రావు దేశాయ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు)

విచారిస్తాం : సుదర్శన్‌గౌడ్, ఏఈవో, బాసర దేవాలయం

ప్రసాదాల టికెట్ల రీసైక్లింగ్ విషయం తెలియదు. దృష్టి సారిస్తాం. విచారణ చేపడుతాం. ఒకవేళ అలా తేలితే మాత్రం చర్యలు తీసుకుంటాం. స్టోర్‌రూమ్‌లో సరుకులు తక్కువగా ఉన్న విషయం వాస్తవమే. స్టోర్‌రూమ్ ఉద్యోగికి ప్రాధాన్యత లేని పోస్టులో కొనసాగించాలనేది ఉంది. కాని సీనియర్ ఉద్యోగుల కొరత వల్ల విధులను కేటాయించాల్సి వచ్చింది. ఈవో రాగానే విధుల నుంచి సదరు ఉద్యోగిని మారుస్తాం.


నిర్మల్ పట్టణంలో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం


మునిపెల్లిలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


శుభాకాంక్షలు తెలుపుతున్న శ్రీహరిరావు, ఆత్రం సుగుణ

నిర్మల్ జిల్లాలో ఘనంగా రంజాన్ వేడుకలు

- శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు
- పోలీసుల భారీ బందోబస్తు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 11 : నిర్మల్ జిల్లాలో గురువారం ముస్లిం సోదరులు పవిత్రరంజాన్ పండగను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండే ప్రార్థన స్థలాలకు కుటుంబ సభ్యులతో తరలివెళ్లి ప్రార్థనలు చేశారు. నూతన వస్త్రాలు ధరించి ఆనందోత్సాహాలతో రంజాన్ పండగలో పాల్గొన్నారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. ఈద్గామ్‌లోని ఈద్గాతో పాటు పలు ప్రాంతాల్లోని మసీద్‌లలో ప్రార్థనలు చేశారు. ప్రజలపై అల్లా కటాక్షం ఉండాలని సుఖశాంతులతో జీవనం గడపాలని వారు ఆకాంక్షించారు. తరువాత మిత్రులు, బంధువులను కలిసి రంజాన్ పండగ శుభాకాంక్షలు తెలిపారు. విందు భోజనానికి ఆహ్వానించి ఆనందంగా గడిపారు.

రంజాన్ సందర్భంగా జిల్లాకేంద్రంలోని ఈద్గాతో పాటు పలు ప్రార్థన స్థలాల వద్ద ముస్లిం సోదరులకు గురువారం డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావు, ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ శుభాకాంక్షలు తెలిపారు. భక్తి శ్రద్ధలతో నెల రోజుల పాటు ఉపవాస దీక్ష చేయడం వారి పవిత్రతకు నిదర్శనమన్నారు. చిన్న పెద్ద తేడా లేకుండా రంజాన్ సంబరాలు జరుపుకోవడం విశేషమన్నారు. అల్లా ప్రజలందరినీ సుభిక్షంగా చూడాలని ఆకాంక్షించారు. పట్టణ అధ్యక్షుడు నాందేడపు చిన్ను, మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేష్, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

సమస్త మానవాళిపై ప్రేమ, కరుణ చూపాలి

లక్ష్మణచాంద : సమస్త మానవాళిపై ప్రేమ, కరుణ చూపాలని మౌల్‌సాబ్‌లు (మత గురువులు) గురువారం శాంతి సందేశం అందజేశారు. 'రంజాన్' పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని మునిపెల్లి, లక్ష్మణచాంద, కాశిగూడ తదితర గ్రామాల్లోని ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మత గురువులు ఖురాన్‌ను పఠించారు. అందులో 'అల్లా' చెప్పిన సత్యాలను, సన్మార్గాన్ని వివరించారు. సమస్త మానవాళి పట్ల స్నేహపూర్వకంగా మెలుగుతూ పేదవారి పట్ల దయ కలిగి ఉండాలన్నారు. దానధర్మాలు చేసి అల్లా దీవెనలు పొందాలని తెలిపారు.

మండల జడ్పీటీసీ ఓస రాజేశ్వర్ ముస్లిం సోదరులకు రంజాన్ పండగ శుభాకాంక్షలు తెలిపారు. పలువురు ముస్లింలను కలిసి 'అలై - బలై' చేసుకుని అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు సిరాజుద్దీన్, మునిపెల్లి మాజీ సర్పంచ్ ఎస్‌డీ సయ్యద్, మాజీ కోఆప్షన్ సభ్యులు జహీరుద్దీన్, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

సారంగాపూర్ : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఘనంగా రంజాన్ పండగను గురువారం ముస్లిం సోదరులు జరుపుకున్నారు. ఈ నేపథ్యంలో వేకువ జామునే ముస్లిం సోదరులు నూతన వస్త్రాలను ధరించి ఈద్గా వద్ద ప్రార్థనలు చేసి పండగ విశిష్టతను వివరించారు. ఒకరికొకరు రంజాన్ పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దీంతో పాటు ముస్లిం సోదరులకు హిందూ సోదరులు రంజాన్ పండగ శుభాకాంక్షలు తెలిపారు.

భైంసా : డివిజన్ పరిధిలో ముస్లిం సోదరులు గురువారం రంజాన్ పండుగను భక్తి ప్రపత్తుల మధ్య ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. పర్వదినాన్ని పురస్కరించుకొని భైంసా పట్టణ గడ్డెన్నవాగు ప్రాజెక్టు సమీపంలోని ఈద్గా వద్ద ముస్లిం సోదరులు సాముహిక ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈద్గామైదానం వద్ద భైంసా పట్టణంతో పాటు సమీప ప్రాంతాల్లోని ముస్లింలు అధికసంఖ్యలో తరలివచ్చి ప్రార్థనలను నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మెన్ జాబీర్ అహ్మద్, భైంసా పట్టణ కమిటీ అధ్యక్షుడు ఫయాజుల్లాఖాన్‌లు ఈద్గా వద్ద హజరైనవారందరికి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముథోల్ ఎమ్మెల్యే రామరావ్ పాటిల్ , ఆదిలాబాద్ లోక్‌సభ కాంగ్రేస్ పార్టీ అభ్యర్థి అత్రం సుగుణ, మాజీ ఎమ్మెల్యేలు బోస్లే నారాయణరావ్ పాటిల్, జి.విఠల్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ సిందే ఆనంద్‌రావ్ పాటిల్‌లు ముస్లిం సోదరులను కలిసి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.


భైంసాలో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


కోలూర్‌లో గ్రామంలో ఈద్గా వద్ద ప్రార్థనలు

ఉపాధి కూలీల పై తేనేటీగల దాడి

- సుమారు 40 మందికి పైగా గాయాలు
- బేల మండలం రేణిగూడ ప్రాంతంలో ఘటన
- క్షతగాత్రులను చికిత్స కోసం రిమ్స్‌కు తరలింపు

ఆదిలాబాద్, ఏప్రిల్11 (ఆంధ్రజ్యోతి)

ఉపాధి హామీ కూలీల పై తేనే టీగలు దాడి చేసిన ఘటన ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలో చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో సుమారు 40 మందికి పైగా గాయపడ్డారు. మొదటగా వారిని ఉపాధి హామీ సిబ్బంది స్థానికులు కలిసి బేల మండలంలోని సైద్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం అంబులెన్స్‌లలో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి... బేల మండలం రేణిగూడ అటవి ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. కూలీలు ఎప్పటిలాగే గురువారం ఉదయం పూట పనులకు వెళ్లారు. ఎవరి పనుల్లో వారు నిమగ్నమై ఉండగా ఒక్కసారిగా తేనెటీగలు మీదకు దూసుకుని వచ్చి దాడి చేశాయి. దీంతో దాదాపు అక్కడున్న 120 మంది కూలీల్లో 40 మంది వరకు గాయాల పాలయ్యారు. వెంటనే అప్రమత్తమైన స్థానికులు, ఉపాధి హామీ సిబ్బంది వారిని మొదటగా సైద్‌పూర్ పీహెచ్‌సీకి పంపించారు. ఈ విషయం తెలిసిన కలెక్టర్ రాజార్షి వెంటనే స్పందించి ఐదు అంబులెన్స్‌లను అక్కడకు పంపించారు. అందులో వారిని హుటాహుటిన రిమ్స్‌కు తరలించారు.మెరుగైన వైద్యసేవలు అందించాలని సంబంధింత అధికారులకు సూచించారు. ఆసుపత్రికి వచ్చిన బాధితులకు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్‌రాథోడ్ పరామర్శించారు. పరిస్థితిని సమీక్షించి వైద్య సేవలను ప్రారంభించారు. ఎవరికి ఎటువంటి ప్రమాదం లేదని డైరెక్టర్ తెలియజేశారు.

ఉపాధి హామీకూలీలను పరామర్శించిన జోగురామన్న

ఆదిలాబాద్‌అర్బన్, ఏప్రిల్ 11 : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ కూలీలను విస్మరిస్తున్నాయని మాజీ మంత్రి జోగురామన్న అన్నారు. బేల మండలం డౌన గ్రామ పరిధిలోని ఉపాధి హామీ కూలీల పై తేనెటీగలు దాడి చేయగా జిల్లా ఆసుపత్రికి తరలించారు.వారిని మాజీ మంత్రి జోగురామన్న పరామర్శించి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విపత్కర పరిస్థితుల్లో కూలీలకు ప్రమాదం సంభవించినప్పుడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థికసాయం అందించే సౌకర్యం ఉంటుందన్నారు. ఉపాధి హామీ కూలీలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విస్మరిస్తున్నాయని ఎండలో సైతం కనీసం తాగు నీరు, టెంట్, ఆటోచార్జీ ఇవ్వకుండా కూలీల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నాయని ధ్వజమెత్తారు. ఇందులో ఇజ్జగిరినారాయణ, యాసం నర్సింగరావు, కౌన్సిలర్ భూమన్న, రాజేశ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


తెనేటీగల దాడిలో గాయపడిన కూలీలను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగురామన్న

ఘనంగా జ్యోతిబా పూలే జయంతి

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 11 : నిర్మల్ జిల్లా కేంద్రంలో గురువారం మహాత్మ జ్యోతి బాపూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీఎన్జీవో భవనంలో జ్యోతిబాపూలే చిత్రపటానికి అధ్యక్షుడు ప్రభాకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... జ్యోతి బాపులేను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సామాజిక న్యాయం, కుల నిర్మూలన, మూఢ విశ్వాసాలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. రవి కుమార్, ఎస్. మోహన్ రెడ్డి, బి. శ్రీనివాస్, అరుణ్ కుమార్, సాయికృష్ణ, గంగాధర్, అశోక్, తదితర సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల నాయకులు గురువారం జ్యోతి బాపూలే 197 జయంతి ఉత్సవాలు నిర్వహించి ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

జ్యోతి బాపూలే బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని ఆయన ఆశయాలు ప్రతి ఒక్కరూ నెరవేర్చాలని బీసీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ యూ. కృష్ణంరాజు పిలుపునిచ్చారు. గురువారం జ్యోతి బాపూలే 197వ జయంతి ఉత్సవాలు నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. సిరికొండ రమేష్, అశోక్ చారి, కిషన్, మార్కంటి జీవన్, ఎంబడి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఆదివాసి విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో గురువారం మహాత్మ జ్యోతి బాపూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీఎన్జీవో భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ జ్యోతి బాపూలే చిత్రపటానికి నివాళులర్పించారు.

మహాత్మ జ్యోతి బాపూలే గొప్ప సామాజిక సంస్కర్త అని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిసెమ్మె రాజు అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో పూలే జయంతి వేడుకను నిర్వహించారు.

జ్యోతిబాపూలే అణగారిన వర్గాల అభివృద్ధికి చేసిన సేవలు ఎనలేనివని టీపీసీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ ఎంబడి రాజేశ్వర్ అన్నారు.

ముథోల్ : మండల కేంద్రమైన ముథోల్‌లో గురువారం మహాత్మ జ్యోతి బాపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు జ్యోతి బాపూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రతి ఒక్కరూ ఆయన చూపిన అడుగుజాడల్లో నడుచుకోవాలని సూచించారు.

బోరుమంటున్న సాగు



శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో తగ్గిన నీటి మట్టం

- జిల్లాలో అడుగంటుతున్న భూగర్భ జలాలు
- ఎండుతున్న యాసంగి పంటలు
- తోడవుతున్న కరెంటు కోతలు
- ఆందోళనలో అన్నదాతలు
- కుభీర్ మండలంలో మరింత దయనీయం
- ఆదుకోకుంటే అంతే సంగతులు!

నిర్మల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : భూగర్భ జలాల మట్టం గణనీయంగా తగ్గుముఖం పడుతుండడంతో జిల్లాలోని యాసంగి పంటల పరిస్థితి గందరగోళంగా మారుతుందంటున్నారు. జిల్లావ్యాప్తంగా 70వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లతో బోరుబావుల ద్వారా రైతులు తమ పంటలకు సాగునీరు అందిస్తున్నారు. ముఖ్యంగా ఇక్కడి యాసంగి పంటలకు బోరుబావుల నీరే శరణ్యమవుతోంది. బోరుబావులను ఆధారంగా చేసుకొని పసుపు, మొక్కజొన్న, కూరగాయలతో పాటు తదితర తరుతడి పంటలను జిల్లాలో పెద్దఎత్తున సాగుచేస్తుంటారు. బోరుబావులకు ప్రస్తుతం కరెంటు ఓ వైపు పడిపోతున్న భూగర్భ జలాలమట్టం మరో వైపు తీవ్రసమస్యగా మారిందంటున్నారు. భూగర్భ జలాల మట్టం తగ్గుముఖం పడుతుండడంతో బోరుబావుల ద్వారా నీరు సక్రమంగా రావడం లేదంటున్నారు. దీంతో పంటలకు అరకొరగానే నీరందించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని చెబుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో సగటు నీటిమట్టం 10 మీటర్ల లోతుగా ఉందని భూగర్భ జలశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఏప్రిల్ మొదటివారంలోనే పరిస్థితి ఇలా ఉంటే రాబోయే రోజుల్లో భూగర్భ జలాల మట్టం మరింత గణనీయంగా తగ్గిపోయే అవకాశాలున్నాయని పేర్కొంటున్నారు. సగటున కాకుండా 10 నుంచి 16 మీటర్ల వరకు కొన్ని చోట్ల భూగర్భ జలాల మట్టం పడిపోయిందని అధికారులు వివరిస్తున్నారు. జిల్లాలోని లోకేశ్వరం మండలం మన్మద్, తానూర్ మండలంలోని ఓని గ్రామాల్లో భూగర్భ జలాల నీటిమట్టం 10 మీటర్ల లోతులో ఉండగా భైంసా మండలం కామోల్, కడెం మండలంలోని చిన్న బెల్లాల్ తదితర గ్రామాల్లో భూగర్భ జలాలు గణనీయంగా పడిపోయినట్లు భూగర్భ జలశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. వేగంగా తగ్గిపోతున్న భూగర్భ జలాల కారణంగా 70వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌దారులంతా ఆందోళనకు గురవుతున్నారు.



- బాసరలో పంటలకు చివరి తడి కోసం రైతుల పాట్లు

కుభీర్ మండలంలో మరింత దయనీయం..

ముఖ్యంగా కుభీర్ మండలంలో భూగర్భ జలాల మట్టాలు వేగంగా తగ్గిపోతుండడంతో ఇక్కడి బోరు బావుల కింద పంటలను సాగు చేసుకుంటున్న రైతాంగం ఆందోళనకు గురవుతోంది. ప్రస్తుత యాసంగిలో శనగపంటతో పాటు మొక్కజొన్న, జొన్న, నువ్వు, పొద్దు తిరుగుడు పంటలను రైతులు బోరు బావుల నీరు ఆధారంతో సాగు చేస్తున్నారు. కుభీర్‌తో పాటు దార్ కుభీర్, పార్డి(కె), సోనారి, గోడాపూర్ తదితర గ్రామాల్లోని పంటల క్షేత్రాల్లో సుమారు మూడు వేలకు పైగా బోరు బావులున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ బోరు బావుల కింద యాసంగి సాగులో భాగంలో దాదాపు ఎనిమిది వేల ఎకరాలకు పైగా మొక్కజొన్న, 8500 ఎకరాల్లో శనగ, 550 ఎకరాల్లో గోధుమ, 380 ఎకరాల్లో నువ్వు, 280 ఎకరాల్లో పొద్దు తిరుగుడు, 2300 ఎకరాల్లో జొన్న పంటలను సాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. చాలా చోట్ల బోరుబావులు భూగర్భజలం అడుగంటి పోతుండడంతో నీటిని ఎత్తిపోయడం లేదని కొన్ని చోట్ల తక్కువ నీరు ఎత్తిపోస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆదుకోకుంటే అంతే సంగతి....

భూగర్భ జలాలు తగ్గిపోవడం కాలువల ద్వారా నీరు పంటలకు సరఫరా కాకపోతుండడంతో ప్రస్తుతం పంటలన్నీ ఎండిపోయే పరిస్థితికి చేరుకున్నాయి. ఈ సమయంలో రైతులను ఆదుకోనట్లయితే వారి పరిస్థితి మరింత దయనీయంగా మారే అవకాశం ఉందంటున్నారు. ఇప్పటి వరకు ఎండిపోతున్న పంటల వైపు అధికారులు గాని ప్రజా ప్రతినిధులు గాని కన్నెత్తి చూడకపోతుండడం విమర్శలకు తావిస్తోంది. రైతులు ఎండిపోతున్న పంటల విషయమై అటు ప్రజా ప్రతినిధులకు ఇటు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ ఎవరు పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎండిపోతున్న పంటలను ఆదుకునేందు కోసం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని రైతులు వేడుకుంటున్నారు. లేనట్లయితే రైతులు యాసంగి సీజన్‌లో పెద్ద ఎత్తున నష్టాల పాలయ్యే ప్రమాదం ఉందంటున్నారు.

భూగర్భ జలాలు గణనీయంగా తగ్గిపోతున్నాయి

- శ్రీనివాస్‌బాబు, జిల్లా భూగర్భ జలాల శాఖ అధికారి



జిల్లాలో క్రమంగా భూగర్భ జల మట్టాలు పడిపోతున్నాయి. జిల్లాలో సగటు భూగర్భ జల నీటిమట్టం 10 మీటర్లుగా ఉంది. భైంసా డివిజన్‌లో భూగర్భ జలాలు వేగంగా తగ్గిపోతున్నాయి. ప్రస్తుతం అక్కడి కొన్ని గ్రామాల్లో 16 మీటర్ల లోతుకు భూగర్భ జలాల మట్టాలు చేరుకున్నాయి. రాబోయే మే నెల వరకు మరింత వేగంగా భూగర్భ మట్టాలు తగ్గిపోయే అవకాశాలున్నాయి. దీని కారణంగా బోరు బావులలో నీరు మరింత కిందకు పడిపోనుంది. దీని వలన పంటలకే కాకుండా తాగునీటికి సైతం ఇబ్బందులు తలెత్తవచ్చు.

దేవరకోట వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న అహోబిల మఠాధిపతి



భక్తులకు తీర్థగోష్టి గావిస్తున్న స్వామిజీ

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 11 : నిర్మల్ పట్టణం దేవరకోట వెంకటేశ్వరస్వామి ఆలయానికి అహోబిల మఠం 46వ జియ్యర్ శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామి విచ్చేసి స్వామివారిని సేవించుకున్నారు. ఆలయంలో భక్తులకు తీర్థ గోష్టి నిర్వహించారు.

బాసరలో శివాలయానికి నిలిచిన విద్యుత్ సరఫరా



సాయంత్రం అంధకారంలో బాసర గోదావరి నది శివాలయం

బాసర, ఏప్రిల్, 11: బాసర గోదావరి తీరంలోని శివాలయంలో కొత్త సమస్య వచ్చిపడింది. ఆలయానికి కరెంటు సరఫరా నిలిచిపోయింది. బాసర సరస్వతి దేవస్థాన పరిధిలో ఈ శివాలయం ఉపఆలయంగా ఉంది. ఈ ఆలయానికి సంబంధించిన ఆదాయం దేవస్థానానికే సమకూరుతుంది. అధికారుల నిర్లక్ష్యం మూలంగా శివాలయానికి ప్రత్యేక మీటర్ లేకుండానే గత కొంత కాలంగా కరెంటు సరఫరా కొనసాగుతుంది. ఈ విషయం ట్రాన్స్‌కో అధికారులకు తెలియడంతో గురువారం కరెంటు సరఫరాను నిలిపివేశారు. పలు మార్లు విద్యుత్ శాఖ అధికారులు దేవస్థాన అధికారుల దృష్టికి ఈ విషయం చెప్పినప్పటికీ పట్టించుకోకపోవడంతో పరిస్థితి తలెత్తింది. గురువారం సాయంత్రం నుంచి శివాలయం అంధకారం ఏర్పడి సాయంత్రం వచ్చిన భక్తులు చీకటిగా ఉండడంతో వెనుదిరిగిపోయారు. స్నానఘట్టాల వద్ద కూడా విద్యుత్ దీపాలు వెలగలేదు. తెల్లవారుజామున నుంచే పుణ్యస్నానాలు ఆచరించే భక్తులు ఇబ్బందులు ఎదుర్కొనున్నారు. రాష్ట్రంలోనే ప్రధాన పుణ్య క్షేత్రాల్లోనైన బాసరలో ఇలాంటి పరిస్థితి ఏర్పడ డంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



సెల్‌ఫోన్ వెలుతురులో దర్శనం

బీఆర్ఎస్ ఖాళీ కావడం ఖాయం

- డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు
- కాంగ్రెస్ గూటికి చేరిన సోన్ మండల బీఆర్ఎస్ నాయకులు



పార్టీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీహరిరావు

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 11 : కాంగ్రెస్ గాలికి నిర్మల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఖాళీ కావడం ఖాయమని డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు అన్నారు. సోన్ మండలానికి చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు గురువారం ఆ పార్టీకి రాజీనామా చేసి డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు సమక్షంలో హస్తం పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు చేరవేదయంలో కార్యకర్తలు ప్రత్యేకంగా కృషి చేయాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృతంలో ఆరు గ్యారంటీ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో విజయఢంకా మోగించేలా పని చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

రక్తదానం చేసిన యువకులు

నర్సాపూర్ (జి), ఏప్రిల్ 11 : జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రిలో ఐదు రోజుల పాప గల గర్భిణీ మహిళకు ఏ పాజిటివ్ ప్లేట్లెట్స్ అవసరం ఉందని సామాజిక మాధ్యమంలో పోస్టు చేయడంతో మండల కేంద్రానికి చెందిన సతీష్ ఆసుపత్రికి వెళ్ళి రక్తదానం చేశాడు. నిజామాబాద్ ఆసుపత్రిలో ఆర్మూర్ మండల్ పెర్కిట్ గ్రామానికి చెందిన చిన్నూబాయికి ఏ పాజిటివ్ రక్తం అత్యవసరమని సామాజిక మాధ్యమంలో పోస్టు చేయడంతో మండల కేంద్రానికి చెందిన ఆడెపు సుధీర్ నిజామాబాద్ ఆసుపత్రికి వెళ్ళి రక్తదానం చేశాడు. ఏదేమైనా జిల్లా వాసులకే కాకుండా ఇతర జిల్లా వాసులకు రక్తదానం చేసిన యువకుల సేవను మండల ప్రజలు గర్వపడుతున్నారు.

మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ

ముథోల్, ఏప్రిల్ 11 : కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల అభివృద్ధి పెద్దపీట వేసినట్లు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లో గురువారం రంజాన్ పండగ సందర్భంగా ముస్లిం సోదరులను కలిసి పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందన్నారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. ముథోల్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఒకసారి తనకు అవకాశం కల్పిస్తే ముథోల్ ప్రాంతాన్ని అభివృద్ధి పరిచేలా తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జి రావుల గంగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యం రెడ్డి, నాయకులు అజీజ్, ఖలీద్ పటేల్, అనీష్, ఫెరోజ్, లతీఫ్, రవి, కిషన్ పటేల్, దిగంబర్, తదితరులు పాల్గొన్నారు.



ముథోల్‌లో పర్యటిస్తున్న కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి సుగుణ

సదర్మాట్‌కు వెంటనే నీటి విడుదల చేయాలి

- కడెం మండలం నచ్చన్ ఎల్లాపూర్ వద్ద రహదారిపై రైతుల ఆందోళన



సదర్మాట్‌కు నీటిని విడుదల చేయాలంటూ ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేస్తున్న రైతులు



నిర్మల్ - మంచిర్యాల రహదారిపై ఆందోళన చేస్తున్న రైతులను సముదాయిస్తున్న పోలీసులు

ఖానాపూర్, ఏప్రిల్ 11 : సదర్మాట్ చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందడం లేదని రైతాంగం ఆందోళనకు దిగింది. గురువారం కడెం మండలంలోని నచ్చన్ ఎల్లాపూర్ వద్ద నిర్మల్ - మంచిర్యాల రహదారిపై లింగాపూర్ గ్రామానికి చెందిన సదర్మాట్ రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ... రెండో పంటకు ఆయకట్టుకు నీరందిస్తామని అధికారులు, పాలకులు హామీ ఇవ్వడంతోనే తాము పంటలు వేసుకున్నామన్నారు. తీరా పంటలు వేశాక సదర్మాట్‌కు సరిపడా నీటిని విడుదల చేయకుండా తమను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. ఎస్సారెస్పీ నుంచి సరిపడా నీటిని విడుదల చేయకపోవడంతో సదర్మాట్ చివరి ఆయకట్టు వరకు నీరు అందడం లేదన్నారు. ప్రస్తుతం వరి పంట పొట్ట దశ దాటి చివరి దశకు చేరుకుంటున్న క్రమంలో సరిపడా నీరు లేక పంటలు ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయకట్టు కింద 14 గ్రామాలు సుమారు 18 వేల ఎకరాల వరకు సాగు భూమి ఉందన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో ప్రస్తుతం కడెం మండలంలోని లింగాపూర్, మాసాయిపేట, నర్సాపూర్, ఎలగడప, పెత్తరుపు, సారంగాపూర్, మద్దిపడగ, ధర్మాజీపేట్, గ్రామాలకు సాగు నీరు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి సదర్మాట్‌కు వెంటనే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో కడెం జడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, కుమ్మరి రంజిత్, కమ్మల స్వామి, కే. రాజేశ్వర్, రెంటం రాజేశ్వర్, కల్వకుంట్ల నరేష్, దుమ్మ సురేష్, మాదాసు నర్సయ్య, ఆకుల నర్సయ్య, తదితరులున్నారు.

ఎట్టకేలకు సరస్వతీ కెనాల్‌కు సాగునీటి విడుదల

- కృతజ్ఞతలు తెలిపిన రైతులు



ఎస్సారెస్పీ సాగునీటి సరఫరాపై నీలి మేఘాలు!

ఈ నెల 8న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఎస్సారెస్పీ నుంచి నీటిని విడుదల చేసిన దృశ్యం

లక్ష్మణచాంద, ఏప్రిల్ 11 : ఈ నెల 8వ తేదీన 'ఎస్సారెస్పీ సాగునీటి సరఫరాపై నీలి మేఘాలు - ఆందోళనలో ఆయకట్టు రైతులు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన సంగతి అందరికీ తెలిసిందే. ఈ సమస్యపై త్వరితగతిన స్పందించిన ఎంపీపీ అడ్వాల పద్మరమేష్ నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. రైతుల గోడు తెలుసుకున్న మహేశ్వర్‌రెడ్డి ఈ నెల 8వ తేదీన ఎస్సారెస్పీ అధికారులతో మాట్లాడి నీటిని విడుదల చేయాలని కోరారు. తాగునీటి కోసం ప్రభుత్వం నీటిని రిజర్వ్‌లో ఉంచాలని ఆదేశించినందున అధికారులు నీటి విడుదలపై తటపటాయించారు. దీంతో మహేశ్వర్ రెడ్డి పట్టుబట్టి గత రెండు రోజులుగా రాష్ట్ర స్థాయి అధికారులతో మాట్లాడి నీటి విడుదల కోసం ఉత్తర్వులు జారీ అయ్యేలా తీవ్ర ప్రయత్నాలు చేసినట్లు ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్ తెలిపారు. ఉత్తర్వులు వెలువడిన అనంతరం గురువారం మధ్యాహ్నం సరస్వతి కెనాల్‌కు నీటిని విడుదల చేయించారు. నీటి విడుదల కోసం ప్రయత్నం చేసిన ప్రతి ఒక్కరికీ రైతులు కృతజ్ఞతలు తెలిపారు. నీటి విడుదల కార్యక్రమ సందర్భంగా నాయకులు అడ్వాల రమేష్, సరికెల గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

రైతులు నీటిని సద్వినియోగం చేసుకోవాలి : డీసీసీ శ్రీహరిరావు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 11 : సరస్వతీ కెనాల్, సదర్మాట్ ఆయకట్టు రైతులు నీటిని సద్వినియోగం చేసుకోవాలని, పంటలను కాపాడుకోవాలని డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావు కోరారు. గురువారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్య, ఎండిపోతున్న పంటల దుస్థితి నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా. స్పందించి వెంటనే నీటిని విడుదల చేశారని పేర్కొన్నారు. నీటి విడుదలలో స్థానిక ఎమ్మెల్యే పాత్ర ఏది లేదని, ఇది రాజకీయ దిగజారుడు తనమేనని స్పష్టం చేశారు.

రేపు బీజేపీ బూత్ స్థాయి సమ్మేళనం

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 11 : జిల్లా బీజేపీ బూత్ స్థాయి పార్లమెంట్ సమ్మేళనం శనివారం ఉదయం 11 గంటలకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని గాయత్రి గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు కే. అంజుకుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

సంక్షిప్త సమాచారం

చిరుత దాడిలో లేగ దూడ మృతి!



మృతి చెందిన లేగ దూడ

తానూర్, ఏప్రిల్ 11 : మండలంలోని బెంబర్ గ్రామ శివారులో గురువారం ఒక లేగ దూడ గుర్తు తెలియని జంతువు దాడి చేయడంతో అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ లేగ దూడ గ్రామానికి చెందిన లచ్చన్న అనే రైతుకు చెందినది. ఈ లేగదూడను చిరుత పులి దాడి చేసి చెట్టుపైకి తీసుకెళ్లి చంపి తినేసిందని రైతు అనుమానం వ్యక్తం చేస్తున్నాడు. దీంతో చుట్టుపక్కల రైతులు భయాందోళనకు గురవుతున్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దు

భైంసా రూరల్, ఏప్రిల్ 11 : మండలంలోని కామోల్ గ్రామంలో చిన్నారెడ్డికి చెందిన ఎద్దు విద్యుదాఘాతంతో గురువారం మృతి చెందింది. పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎద్దు మేత మేస్తుండగా ఎర్త్ వచ్చి అక్కడికక్కడే మృతి చెందింది. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని అక్కడ రైతులు తెలిపారు. ఎద్దు విలువ రూ. 60 వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

విద్యుదాఘాతంతో నష్టపోయిన రైతు కుటుంబాలను ఆదుకుంటాం

భైంసా, ఏప్రిల్ 11 : విద్యుదాఘాతంతో అగ్ని ప్రమాదం జరిగి మొక్కజొన్న పంటను కోల్పోయిన కుంసర గ్రామ బాధిత రైతు కుటుంబాలను ఆదుకుంటామని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ పెర్కొన్నారు. గురువారం దగ్ధమైన మొక్కజొన్న పంటచేలను పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను బాధిత రైతులు మెడిపెల్లి సాయన్న, మెడిపెల్లి దేవేందర్‌లను అడిగి తెలుసుకున్నారు. మూడు ఎకరాలలో మొక్కజొన్న కంకులను తెంపి కుప్పలుగా పోసి ఉంచినట్లుగా బాధిత రైతులు తెలిపారు. అయితే పంటచేల మీదుగా వెళ్లే విద్యుత్ లైన్ల మూలంగా విద్యుదాఘాతం జరిగి ప్రమాదం జరిగి మొక్కజొన్న కంకులన్నీ దగ్ధమైనట్లుగా వివరించారు. ఎమ్మెల్యే వెంట బీజేపీ ప్రతినిధులు సోలంకే భీంరావ్ పాటిల్, గుంటూర్ శంకర్‌తో పాటు పలువురు ఉన్నారు.